ప్రభ:- గణపతి – శివాంకమునందుండు వాఁడని వెనుక చెప్పినపుడు శక్తి ధరుఁడగు స్కందుఁడు శక్తి ప్రియుఁడని చెప్పఁబడినది. చిన్నవాడు – తల్లికి వాత్స్య పాత్రుఁడు గదా?

మూ॥ జయతి త్రిపురారి భామినీ, గణపత్యాదిమరుత్ ప్రసూరుమా।
తమసూత సురారి ఘాతయే। త్రిదశానామపియా చమూపతిమ్॥ 24

అసుర ధ్వంసము కొఱకు దేవతలకు గూడ సేనా పతియగు కుమారుని, గణపతి మొదలుగాఁగల మరుత్తులను, కన్నతల్లియగు త్రిపురారిభామిని (శివకాంత) యుమ ప్రకర్షచే వెలయుఁగాత!

ప్రభ:- ''గురుముత్తమమ్'' అను శ్లోకమున బ్రహ్మణస్పతి- మరుత్తని చెప్పఁబడినది. తరువాతి శ్లోకమున – ఆ బ్రహ్మణస్పతియే గణపతియనియు, జ్యేష్ఠుఁడనియు చెప్పఁబడినది. సురారులగు రాక్షసులను సంహరించుటకు జగన్మాతయగు పార్వతి దేవసే నానియగు స్కందుని గనియెనని భావము.

మూ॥ స్వకుటుంబకథాభిధాయినీ ర్గణనాధస్య వియోగినీరిమాః
అవధారయతు ప్రసన్నయా నగనాథప్రియనన్దినీధియా॥ 25

తనకుటుంబము యొక్క కథలను దెలుపునవియగు గణపతికవి యొక్క వియోగినీవృత్త నిబద్ధములగు ఈ స్తుతులను – పర్వతరాజప్రియ పుత్రియగు నుమాదేవి – ప్రసన్నమగు బుద్ధిచేత నిశ్చయించుఁగాత!

ప్రభ:- నాచే నుల్లేఖింపఁబడిన స్వకుటుంబకథలు – సమీచీనములో, కావో, తద్విజ్ఞయగు జగదంబయే పర్యాలోచించుఁగాతమని భావము.

ఇది – సవ్యాఖ్యమగు – ద్వావింశ స్తబకము

****

ఓం నమో భగవతే శ్రీరమణాయ

ఉమా సహస్రము

(ఆరవ శతకము – తృతీయస్తబకము)

త్రయోవింశ స్తబకము

అవ:- ఇరువది మూడవదియు, ఇరువది నాలుగవదియు నగు స్తబకములు ప్రకీర్ణకములు - అందీ యిరువది మూడవ స్తబకము - గాయత్రీగర్భితము. ఇందు- 'తత్' అనునది మొదలుకొని, 'యాత్' అనునది తుదిగాఁ గల గాయత్రీ మంత్రమునందలి యిరువది నాల్గు వర్ణములు క్రమముగా, క్రింది శ్లోకములయందలి తృతీయ పాదములయందలి చతుర్థవర్ణములై కాన్పించును.

మూ॥ కిరదివామృతం కిరణమాలయా
జయతి **తత్** స్మితం, శివవధూస్మితమ్॥ 1

కిరణమాలచేత – అమృతమును వర్షించునది వలెనున్న శుభమగు – ఆశివ వధూస్మితము – జయించుచున్నది.

ప్రభ:- సితస్మితప్రసారము – అమృతమును వర్షించుచున్నట్లు సంభావింపఁబడినది. కావున నిందలి యలంకారము– ఉత్ప్రేక్ష. దీనిచేత శివవధూ ముఖమునకు చంద్రునితోడి యుపమానము గమ్యమగుచున్నది. గాయత్రీ మంత్రము నందలి మొదటి యక్షరము 'తత్' అనునది – ఇందలి మూడవ పాదము నందలి నాలుగవ యక్షరముగా గ్రహింపఁబడినదని తెలియునది.

మూ॥ తవ పదంపరే మమ గుహాన్తరే
స్ఫురతుసర్వదా, వికసితంముదా॥ 2

ఉత్తమురాలవగు జననీ! నీ పాదము – నా గుహాంతరమున (హృదయము నందు) ముదము చేత వికసితమై యెల్లప్పుడునుగూడ స్ఫురించుగాత!

ప్రభ:- శ్రుతులయందు హృదయము – గుహగా వినఁబడుచున్నది ''నిహితం గుహాయా'' (హృదయము నందుండునది) అను వచనము శ్రుతి ప్రసిద్ధముగదా.

మూ॥ పదమధోఽమ్బుజాన్నఖిలభిద్యతే
మదనవిద్విషః సదనరాజ్ఞి! తే॥ 3

మదనరిపుఁడగు శివుని గృహమున కీశ్వరివగు జననీ! నీచరణము - క్రిందిద[illegible]మగు హృదయము (అనాహతము) కంటె వేఱుకాదు. గాయత్రీ మంత్రము నందలి 'వి' ఇందున్నది.

ప్రభ:- నీ పదమే – కమలము. కావుననే వెనుక శ్లోకమునందు - ఆ కమలము (పాదము) నా హృదయము నందెల్లపుడునుగూడ వికసితమై స్ఫురించుఁగాతమని ప్రార్థింపఁబడినది. మీఁదనున్న కమలము సహస్రారము. కావున క్రిందనున్న కమలము నీపాదవేు యని చెప్పఁబడినది. దీనికి ''పదమధోఽమ్బుజాత్'' అను పాఠాంతరము గూడనున్నది.

మూ॥ విభుతయోరరీకృత బహూద్భవౌ,
విదధతుర్ జగత్ త్రయమిదం శివౌ॥ 4

సర్వవ్యాపకత్వము చేత – బహూద్భవము నంగీకరించిన పార్వతీ పరమేశ్వరులు – భూలోక, భువర్లోక, స్వర్లోకములను (త్రిభువనమును) నిర్మించిరి.

ప్రభ:- సర్వ వ్యాపక భావము చేత నానాత్వము నంగీకరించి శివులు - త్రైలోక్య విధాతలయిరని భావము. (తుర్)

మూ॥ తవతుఖేలనే, నలిన జాణ్డకమ్,
గిరిశవల్లభే! భవతికన్దుకమ్॥ 5

శివ ప్రేయసీ! ఈ జగత్ త్రయము – మీ చేత నిర్మింపఁబడినది. అయినను ఈ బ్రహ్మాండము – నీకొక క్రీడాకందుకమైయున్నది.

ప్రభ:- మాదృష్టికిది – అపారమయినను నీ దృష్టికిది అత్యల్పమను నర్థమును, నలినజాండకమ్'' అను పదము వలనఁ దెలియునది. (వ)

మూ॥ సకలమస్త్యుమే! సదభయఙ్క రే!
తవకరేఽపరే కిమపినో నరే॥ 6

ఉమాదేవి! సజ్జనుల కభయమునిచ్చునదియు, ఉత్తమమును, అగు నీహస్తమునందు సర్వమును గలదు. నరునియందేమున్నది? (రే)

ప్రభ:- సర్వమును త్వదధీనము. మనుష్యున కధీనమయిన దేదియును లేదు. మనుష్యున కధీనమయినట్లు కన్పించు వస్తువుగూడ యథార్థముగా మనుష్యున కధీనమయినది కాదు.

మూ॥ కిమివ వర్ణ్యతాం కశశికుణ్డలా,
ఉడుమణి స్రజా ప్రవిలసద్గలా॥ 7

సూర్య – చంద్రులు కర్ణాలంకారములుగాఁ గలదియు, నక్షత్ర రూపమగు రత్నమాల చేత నుజ్జ్వలమగు కంఠము గలదియు, అగు జగన్మాత – ఎట్లు వర్ణింపఁబడును?

ప్రభ - అత్యుజ్వలములు – అత్యంత దూరస్థములు అగు సూర్య – చంద్ర– నక్షత్రములు – కర్ణభూషణ – కంఠాభరణ స్థానములుగా గలదగుట వలన అత్యుజ్వలయు, అమేయయు, బృహద్రూపయు, అగు ఆ పరమేశ్వరిని వర్ణించుటకు శక్యము కానేరదని భావము. (ణి)

మూ॥ భణ నిరన్తరం బహుగుణాముమామ్
గతభయం విధేహ్యమలవాణి! మామ్॥ 8

ఓ నిర్మలమగు వాక్యమా! బహు గుణయగు ఉమను నిరంతరమును వాకొనుచుండుము. ఇట్లు – ఉమానామోచ్చారణము చేత నన్ను భయవర్జితు నొనరింపుము.

ప్రభ:- ఎల్లప్పుడును గూడ – ఉమయొక్క నామమును కీర్తించుట చేత భీతియంతయు పరుగెత్తునని భావము. (యం)

మూ॥ అవజహీహివా ననుభజామ్యహమ్
భువనభర్త్రి! తే, చరణమన్వహమ్. 9

నీవు రక్షింపుము. లేక వర్జింపుము. (పాలముంచెదవో నీలముంచెదవో) ఓ భువనభర్త్రీ! నేనెల్లపుడును నీ పాదమును సేవించుచునే యుందును.

ప్రభ:- నేను నీ పాద భజనమును నిత్యము నొనర్చుచుందును. పాలముంచెదవో నీటముంచెదవో భారము నీయదియే. ఫలము నపేక్షింపక భజించుటయే నాకు స్వాభావికము. అదియు నీ ప్రసాదమేయని భావము (భర్)

మూ॥ గణపతేః శిరః కమలచుమ్బినీ
భవతు **గో**పతి ధ్వజకుటుమ్బినీ॥ 10

వృషభధ్వజకుటుంబినియగు పార్వతి – గణపతినగు నా యొక్క శీర్షమును చుంబించుఁగాత!

ప్రభ:- యోగ విభవము వలన వికసించిన గణపతి శిరఃకమలము – మకరంద భరితమను నంశము గమ్యమగుచున్నది. ఆ మకరందము నాస్వాదించుటకు సమర్థత గలదగుట వలన పరమేశ్వరి మధుకరమగు గాతమనునర్థ మాక్షేపింపఁబడుచున్నది.

ఇచ్చట దేవి- భోక్త్రియు – భక్తుఁడగు యోగి – భోగ్యమును నగుచున్నారని గ్రహించునది. (గో)

మూ॥ దహరమజ్జనం విదధతం జనమ్
పరమ దేవతే నయసి ధామతే॥ 11

పరమ దేవతవగు జననీ! దహరమను పేరుగల హృదయమున మజ్జనము నొనర్చుచున్న మనుజాని నీయొక్క ధామమును పొందించెదవు.

ప్రభ:- హృదయమునందున్న ఆత్మ వస్తులాభము కొఱకు హృదయ కూపమున ప్రవేశించిన వానికి నీ స్వరూపము లభించునని భావము. నీవే హృదయ గతమగు పరమవస్తువని భావము. (దే)

మూ॥ జనని విజ్ఞతా భవతు ధీమతామ్
అను**భవ**స్తుతే కరుణయాసతామ్॥ 12

జననీ! ధీమంతులగు జనులకు పాండిత్యము కలుగవచ్చును. కాని సజ్జనులగు వారికి అనుభవము (అపరోక్షమగు సాక్షాత్కారము) నీయొక్క కృపచేతనే కలుగును.

ప్రభ:-పండితులకు శాస్త్రీయమగు జ్ఞానము మాత్రమే కలుగును. తత్త్వ సాక్షాత్కారము మాత్రము భగవతీ ప్రసాద లభ్యమేయగును. పండితుఁడయినను, పండితుఁడు కాకున్నను, సజ్జనుడే – ఆయనుగ్రహమునకు పాత్రుఁడగును. దీనికింకొక విధమగు నర్థముగూడఁ గలదు. ''ధీమంతులకు పాండిత్యము లభించినను, పరమేశ్వరీ స్వరూప సాక్షాత్కారము మాత్రము – సత్పురుష ప్రసాద ద్వారముననే లభించును.'' (వన్)

మూ॥ అచలయాధియా హృది గవేషణమ్
వృషహయప్రియా నగరశోధనమ్ ॥ 13

నిశ్చలమగు బుద్ధిచేత హృదయమునందు వెదకుటయే వృషభ వాహనుని ప్రియురాలగు పార్వతి యొక్క నివాసస్థలమగు నగరమును (జ్ఞాన స్వరూపమును) శోధించుటయగును.

ప్రభ:- గవేషణకర్మయే - హృదయశోధనము. హృదయము - శుద్ధమగునపుడు - సిద్ధస్వరూపిణియగు భగవతి యిచ్చట సాక్షాత్కరించునని భావము. (య)

మూ॥ నవిజహామితే చరణనీరజమ్
అవని **ధీ**మతా మవ నవానిజమ్॥ 14

దేవీ! బుద్ధి మజ్జనరక్షిణీ! నీవు రక్షించినను రక్షింపకున్నను నీచరణ సరోజమును విడువను. (ధీ)

మూ॥ పదముమేఽమ్బ! తే హృది విచిన్వతే
ఫలిత**మ**స్తకాః పరమ దేవతే॥ 15

పరమ దేవతవగు జననీ! ఉమా! ముసలితనము చేత శిరస్సు పండిన వృద్ధులు - నీ పదమును హృదయమునందు వెదకుచున్నారు.

ప్రభ:- బహువత్సరములు ధ్యానము నొనర్చుచున్న వారి శిరస్సులు - వయోవృద్ధి చేత నెరసిన వెండ్రుకలు గలవగుచుండును. నీవందఱకును సుఖముగా లభించుదానవు కావు. ధ్యానించుచు, ధ్యానించుచు, దేహము వయస్సు చేత జీర్ణించును. (మ)

మూ॥ స్వయమనామ యేసకలధాత్ర్యసి
నిజమ**హి**మ్నిసా త్వమయి తిష్ఠసి॥ 16

అమ్మా! నీయొక్క సాక్షాత్కారము కలుగకున్నను కాలవశము చేత ... లకు జర ప్రాప్తించుచున్నది. నీవు మాత్రము- అనామయవై సర్వమును పోషించుదానవగుచున్నావు. రోగస్పర్శ లేని స్వీయమగు మహత్త్వమునందున్నావు.

ప్రభ:- మనుష్యుని శరీరము ఎంతకాలము నీ మహా మహిమయందుస్థితిని పొందకుండునో, అంతకాలము జరాహేతువగు రోగాదికమును - పొందుచునె యుండునని భావము. (హి)

మూ॥ స్థితి మసాధయం; స్తవపదామ్బుజే
విధిమ**ధి**క్షిప త్యలసధీర జే॥ 17

జన్మ రహితమగు నీ పదపద్మమునందలి నిష్ఠను సంపాదింపక అలసమగు బుద్ధిగల మనుష్యుఁడు, దైవము (విధి) నధిక్షేపించుచుండును. (నిందించు చుండును)

ప్రభ:-అలసబుద్ధి యనగా మందమగు బుద్ధిగలవాఁడు; నీచరణ స్థితినొందుటకు పురుష ప్రయత్నము కావలసియుండ, దాని నెఱుఁగక మందుఁడగు పురుషుఁడు ప్రారబ్ధము వలన నాకు పరమేశ్వరీ పద సాక్షాత్కారము కలుగుట లేదని విధిని దూషించుచుండును. (ధి)

మూ॥ స్యతు మదాపదం శివవధూపదమ్
యదృష**యో** విధు స్త్రిభువనాస్పదమ్॥ 18

ఋషులు - దేనిని త్రిలోకములకును ఆశ్రయమగు స్థానమని తెలియు చున్నారో, ఆశివవధూచరణము - నాయాపదను బాపుఁగాత! (యో)

మూ॥ గుణగణం గృణం స్తవ శివేశివమ్
గతభయోఽభవం మదమితో నవమ్॥ 19

శివా! నీ కల్యాణ గుణగణమును గణించుచు (స్తుతించుచు) క్రొత్త సంతోషమునొందిన నేను భయవర్జితుఁడ నయితిని.

ప్రభ:- ప్రసిద్ధమగు నీకల్యాణ గుణగణ స్తవ మహిమ - అభినవ హర్ష లాభమును భయప్రణాశమును, గూడ - కలిగించునని భావము. (యో)

మూ॥ తవకృపావశాత్ తదిదమవ్యయే!
జనని! నఃప్లుతి - స్తవ యదఙ్ఘ్రయే॥ 20

అవ్యయవగు జననీ! నీ చరణము కొఱకయిన మా ఉద్గమనము - నీ కరుణా విలాసమువలననే సంభవించుచున్నది.

ప్రభ:- భవదీయ చరణోన్ముఖగమనము - నీ కరుణక దీనమైనదియే. ఈయున్ముఖ గమనమునందు మా పౌరుషము (పురుష ప్రయత్నము) హేతువు కానేరదు. (నః)

మూ॥ నయనదృశ్యయోరయి యదన్తరమ్
తదమరస్తుతే! తవవపుఃపరమ్ ॥ 21

ఓ దేవ వినుతా! జననీ! చూచునదియగు నేత్రమునకును– చూడఁదగిన వస్తువునకును గల అంతరము (అవకాశము) నీయుత్తమ శరీరమగుచున్నది.

ప్రభ:- దృగ్ - దృశ్యములకు (నేత్రమునకు - బాహ్య పదార్థమునకు) సంబంధించిన యంతరమాకాశమేయగును. దృగ్ - దృశ్యముల యంతరము దర్శన క్రియచేత వ్యాపింపఁదగినదియు దర్శనము (చూచుట) జ్ఞానరూపమును అగుటవలన ఆదృగ్ - దృశ్యముల నడుమనున్న యవకాశము - చిన్మయాకాశమే యగునని విజ్ఞులు తెలియుదురు. కావున **పరమేశ్వరి శరీరము - చిదా కాశమేయని తెలియునది.** (ర)

మూ॥ అహమితిస్ఫుతిః శ్వనువిభాసతే
ఇతి విచోదయన్ మహమలీయతే॥ 22

అమృతసఙ్ఞకే సుఖచిదాత్మకే
మతి మదర్థితే జనని! ధామ్ని తే॥ 23

''నేను'' అనుస్ఫురి (తలంపు) దేనియందు విభాసించును'' అని విచారించుచు (వృత్తిని ప్రేరేపించుచు) పురుషుఁడు మహద్ (బృహద్) రూపమును, అమృత సంజ్ఞకమును (అమృతమను పేరుగలదియు) సుఖ చిదాత్మకమును (సుఖము - చైతన్యము, స్వరూపముగాఁ గలదియు) మతి మదర్థితమును (బుద్ధిమంతుల చేతఁ గోరఁదగినదియు) అగు నీయొక్క ధామమున (స్థానమున) లయించును **ఇది రమణోపదేశము.**

ప్రభ:-''నేను'' అనుబుద్ధి యొక్క భావమెచ్చటిది? అనఁగా; అహమను జ్ఞానమునకు మూలము - ఎక్కడనున్నది? అని సూక్ష్మమగు బుద్ధిచేత విచారించుచు పురుషుఁడు = అమృతమను పేరు గలదియు, చిత్తు - ఆనందము - స్వరూపము గాఁగలదియు, అగు నీయొక్క స్థానమున (గమ్యస్థానమున) లయము నొందునని భావము. ఈ యర్థము - నిజాచార్యుఁడగు రమణ భగవానుని యుపదేశమై యున్నది. గణపతి కవి ఆయుపదిష్టాంశము నిచట ప్రదర్శించెనని పాఠకులు గ్రహించునది **దీనిని నిత్యము పఠించునది.** (చో) (ద)

మూ॥ అయిముదాస్పదం స్పృశతి తేపదమ్
శ్వసితయాత్రయా సతతదృష్టయా॥ 24

సాధకుఁడగుజనుఁడు - ఎల్లప్పుడును వీక్షింపఁబడుచున్న శ్వసితయాత్ర చేత (రాకపోకలు గల ప్రాణవాయు సాధనము చేత) ప్రీతిస్థానమగు నీచరణమును స్పృశించుచుండును.

ప్రభ:- కృతార్థుఁడగు పురుషుడు– శ్వాసము యొక్క యాతాయాత విహారము నన్వేషించుటయే యగు సాధనము చేత ఆనంద నిలయమగు నీ పదము నొందునని భావము. ఊర్పుయొక్క రాకపోకలను గుర్తించుట వలన – దేవీ స్వరూపమగు ఆనందము లభించును. (యాత్)

మూ॥ ధధతుసత్ కవే ర్గణపతేరిమాః
నగభువోముదం, నరమనోరమాః॥ 25

దోష రహితమును, శబ్దార్థమాధుర్యాది గుణ సహితమును, అగు కావ్యమును రచించు గణపతికి సంబంధించిన 'నరమనోరమా' వృత్త నిబద్ధములగు ఈ స్తుతులు నగకుమారికి ప్రీతి నొసంగుఁగాత!

ఇది - సవ్యాఖ్యమగు ఇరువది మూఁడవ స్తబకము.

****

ఓం నమోభగవతే శ్రీరమణాయ

ఉమా సహస్రము

(ఆరవ శతకము – చతుర్థస్తబకము)

చతుర్వింశ స్తబకము

అవ:- ఇరువది నాలుగవదియగు నీ స్తబకముకూడ – ప్రకీర్ణకమై యున్నది.

మూ॥ చన్ద్రికాసితం చణ్డికాస్మితమ్।
భూతలేసతాం భాతుభూతయే॥ 1

వెన్నెలవలె తెల్లనిదగు చండిక చిరునవ్వు – ఈలోకము నందలి శిష్టుల కైశ్వర్యము నొసంగుటకై వెలయుఁగాత!

మూ॥ భాల చక్షుష, శ్చక్షుషాం ఘనమ్।
కిఞ్చిదస్తుమే శస్త వర్ధనమ్॥ 2

లలాట నేత్రుఁడగు హరుని నేత్రత్రయమునకు భోగ్యమగు ఉమావస్తువు (ఉమాదేవి) నాయొక్క క్షేమమును వృద్ధి నొందించునది యగుఁగాత!

ప్రభ:- భావుకము, భవుకము, భవ్యము, కుశలము, క్షేమము, శస్తము, అనునవి క్షేమ శబ్దమునకు పర్యాయపదములు. హరత్రినేత్ర తర్పణమగు ఉమాఖ్యమగు ఘనము – నా క్షేమమును ఘటించుఁగాత! అని యర్థము.

మూ॥ సాధు సన్తతి క్షేమకారిణీ
ఘోరదానవానీకదారిణీ॥ 3